
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

సోమవారం 25 నవంబరు 2024

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 25న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కారం వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజలు వారి సమస్యలను అధికారులకు తెలుపుకోవచ్చన్నారు.

వెనుకబడిన మండలాల రైతులను ఆదుకోవడానికి అప్పటి ప్రభుత్వం నిర్మించిన సోంపల్లె మినీ ప్రాజెక్టు రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. ప్రాజెక్టు ప్రారంభించి 15 ఏళ్లైనా ఇప్పటికీ కనీసం ఆ ప్రాజెక్టు కింద ఒక ఎకరా కూడా ఆయకట్టు భూమి సాగు కాలేదు. ప్రాజెక్టు నిర్మించినా దానికి అనుబంధంగా కాలువలు నిర్మించకపోవడంతో ఆ ప్రాజెక్టు కింద ఉన్న 1200 ఎకరాల ఆయకట్టు రైతులకు ఎటువంటి ఉపయోగం లేదు.

ముళ్లకంపలతో పూర్తిగా మూసుకుపోయిన మినీ సోంపల్లె ప్రాజెక్టు కట్ట



ఉన్నా.. లేనట్టే..!

- రైతులకు ఉపయోగపడని మినీ సోంపల్లె ప్రాజెక్టు
- సాగునీరెప్పుడిస్తారో..
- ఏళ్ల తరబడి వృథాగానే..
- ప్రాజెక్టు కింద సాగుకు నోచుకోని భూములు
- కాలువల నిర్మాణంలో జాప్యం
- మిట్టసోంపల్లె మినీ ప్రాజెక్టు దుస్థితి

పెద్దతిప్పసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని వెనుక బడిన మం డలాలైన పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల రైతుల కోసం 2004 సంవత్స రంలో అప్పటి ప్రభుత్వం మడుమూరు గ్రామం మిట్టసోంపల్లె సమీపంలో అప్పటి తంబళ్లపల్లె ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డి కృషితో మిట్టసోంపల్లె మినీ ప్రాజెక్టును పెద్దేరు వాగుపై నిర్మించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రూ.6.20 కోట్లతో పనులు చేపట్టి నిర్మాణాన్ని పూర్తి చేసి 2009లో ప్రారంభించారు. అయితే ఈ ప్రాజెక్టు కింద పీటీ ఎం, ములకలచెరువు మండలాల్లో సుమారు 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ప్రాజెక్టు కట్టిన ప్పటి నుంచి ఇప్పటివరకు ఆయకట్టు కింద ఒక ఎకరా భూమి కూడా ఈ ప్రాజెక్టు నీటి వల్ల సాగు కాలేదు. ప్రాజెక్టు కట్టినా కాలువలు నిర్మించ కపోవడంతో ప్రాజెక్టు ఉన్నా.. లేనట్లేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీరు వచ్చి ప్రాజెక్టు నిండితే ఎక్కువగా సాగయ్యేది ఒక్క ములకలచెరువు మండలంలోనే. అయితే ఈ ప్రాజెక్టు ప్రారంభించి నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క రైతు కూడా ఈ ప్రాజెక్టు నీటి వల్ల పంటలు సాగు చేసిన దాఖలాలే లేవు.

ప్రాజెక్టు ఇక్కడ.. సాగు అక్కడ..

ఈ మినీ ప్రాజెక్టు పీటీఎం మండలంలో ఉంది. సాగు మాత్రం ములకలచెరువు మండలంలో ఉండడంతో పీటీఎం మండలానికి చెందిన రైతులకు ఉపయోగం లేదు. ఈ ప్రాజెక్టు నీటితో పూర్తి స్థాయి పనులు పూర్తి చేసి సాగులోకి వస్తే ములకలచెరువు మండల రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రాజెక్టును ప్రారం భించి ఏళ్లు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు కానీ, ఇరిగేషన్ అధికారులు కానీ నేటికీ ప్రాజెక్టును సందర్శించిన దాఖాలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టులోని అరకొరగా వచ్చిన నీరు వృథాగా పోతున్నాయి తప్ప రైతులకు ఎటువంటి ఉపయోగం లేకుండాపోతున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి కూడా ఇరిగేషన్ అధికారులకు ప్రాజెక్టు సమాచారంపై అవగాహన లేకపోవడం గమనార్హం.

ముళ్లకంపలతో మూసుకుపోయిన కట్ట

ఇరిగేషన్ అధికారులు గానీ రెవెన్యూ అధికారులు గానీ మినీ ప్రాజెక్టు వైపు కన్నెత్తి చూడకపోవడంతో అది ముళ్లకంపలతో పూర్తిగా మూసుకుపోయి ప్రాజెక్టు ఉనికినే కోల్పోయింది. ఈ ప్రాజెక్టు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెద్దతిప్పసముద్రం మండలానికే తలమానికంగా ఉండేది. అప్పటి తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా ఉన్న కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో స్వయంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడి ప్రాజెక్టును నిర్మించేలా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏళ్లు గడుస్తున్నా ఈ ప్రాజెక్టు గురించి పట్టించుకునే ప్రజాప్రతినిధి కానీ అధికారి లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరదలతో మొరవ కొట్టుకుపోయింది

2022-23లో వచ్చిన వరదల కారణంగా మొరవతో పాటు మొరవ కింద ఉన్న సాగు భూములు సైతం పూర్తిగా కోసుకుపోయాయి. అరకొరగా చేసిన కొద్ది పాటి కాలువలు ఆనవాళ్లు కూడా లేకుండా పూడిపోయాయి. ఈ కాలువల నిర్మాణాలు ఎప్పటికి పూర్తి చేస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు. చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు, కాలువలు శిథిలావస్థకు చేరుకుంటున్నా వాటిని పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన ఇరిగేషన్ అధికారులు ఉన్నా లేనట్లేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన తూములు, చెరువులు, ప్రాజెక్టులు, కుంటలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వాటిని అందుబాటులోకి తీసుకుని వస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు మేలు చేకూర్చాలని కోరుతున్నారు.



నీరు అడుగంటి ముళ్లకంపలతో దర్శనం ఇస్తున్న మినీ ప్రాజెక్టు



గతంలో వచ్చిన వరద తాకిడికి దెబ్బతిన్న మొరవ



గత వరద తాకిడికి పూర్తిగా కోతకు గురైన దిగువ ఉన్నప్రాంతం

రాజంపేట పట్టణంలో శ్రమదానం చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, జీఎన్ నాయుడు తదితరులు



రాజంపేటలో శ్రమదానం

- పాల్గొన్న కలెక్టర్, జీఎన్ నాయుడు

రాజంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని విద్యార్థులతో కలిసి కలెక్టర్ చామకూరి శ్రీధర్, రీజెన్సీ సిరామిక్ పరిశ్రమల అధినేత జీఎన్ నాయుడు స్వయంగా రోడ్లు ఊడ్చి చెత్తను తొలగించారు. రీజెన్సీ నలందా విద్యాలయ విద్యార్థులు 500 మందితో ఆదివారం రాజంపేటలో నిర్వహించిన శ్రమదానం కార్యక్రమానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోడ్లను శుభ్రం చేసి కంప చెట్లను తొలగించి చెత్తాచెదారాన్ని తీసివేశారు. జీఎన్ నాయుడుతో పాటు కలెక్టర్ కూడా స్వయంగా చెత్తను ఊడ్చారు. ఈ సందర్భంగా రీజెన్సీ నలందా విద్యాలయంలో జీఎన్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో జీఎన్‌నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించి శ్రమదానం చేయడం, తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. జీఎన్ నాయుడు మాట్లాడుతూ రాజంపేటలో చాలా రోజులుగా అపరిశుభ్రత ఎక్కువైందని, తాను, తనతో పాటు విద్యార్థుల చేత శ్రమదానం చేయించి పరిసరాలను పరిశుభ్రం చేయించినట్లు తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 200 మంది మున్సిపల్ కార్మికులకు శ్రమదానం కిట్లు అందజేశారు. శ్రమదానంలో పాల్గొన్న వారికి భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, తహసీల్దార్ పీరుమున్నీ, ఎంపీడీవో వరప్రసాద్, న్యాయవాది గుడారు శ్రీనివాసులునాయుడు, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, నందలూరు మండల మాజీ అధ్యక్షుడు పల్లె సుబ్రమణ్యం, మాజీ ఎంపీటీసీ గుడారు సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పొందూరు కొండయ్యానాయుడు, న్యాయవాది హనుమంతునాయుడు, నలందా విద్యాలయ సీఈవో గుడారు విజయచందు, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఫీజు చెల్లించలేదనే కారణంతో తరగతుల నుంచి పంపడం, హాల్ టికెట్స్ ఇవ్వకపోవడం, పరీక్షలు లేదా ప్రాక్టికల్ ఎగ్జామ్స్ రాయనివ్వకుండా చేస్తే సంబంధిత కళాశాలలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు, షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన తరతుల, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల, మైనార్టీ తరగతులకు చెందిన ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఆపై చదువుతున్న విద్యార్థులకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. వీటి ప్రకారం జిల్లాలోని ప్రైవేటు కళాశాలల యాజమాన్యం ప్రభుత్వం నుంచి ఉపకార వేతనంకు అర్హత గల విద్యార్థులను ఫీజు చెల్లించలేదనే కారణంతో తరగతుల నుంచి పంపడం, హాల్ టికెట్స్ ఇవ్వకపోవడం, ఎగ్జామ్స్, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ రాయనివ్వకుండా చేయడం లాంటి చర్యలు చేయవద్దని, అలా చేస్తే సంబంధిత కళాశాలలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

మానససరోవరంలో ఉల్లాసంగా బోటింగ్ చేస్తున్న దృశ్యం



హార్సిలీ హిల్స్‌లో హాయి..హాయిగా..

- పర్యాటకులతో కిటకిటలాడిన కొండ
- విందులు.. పార్టీ ఈవెంట్లతో బిజీబిజీ

బి.కొత్తకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. కొండపై ఉన్న ముఖ్య ప్రదేశాలైన గాలిబండ, మానససరోవరం, జూపార్క్, ఏరియల్ వ్యూపాయింట్స్, ఏపీ టూరిజం అతిథిగృహాలు తదితర ప్రదేశాలలో కుటుంబసమేతంగా వచ్చినవారు, యువకుల బృందాలు, ఉద్యోగులు సరదాగా, ఉల్లాసంగా గడుపుతూ సేదతీరారు. ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ హిల్స్ అందాలను ఆస్వాదించారు. సాధారణంగా వారాంతంలో బెంగళూరు నుంచి వందల సంఖ్యలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు హిల్స్‌కు చేరుకుని విందు, వినోదాలతో ఎంజాయ్ చేయడం పరిపాటిగా మారింది. వీరికి తోడు పూర్వవిద్యార్థుల కలయికలు, నూతన వధూవరుల, చిన్నారుల ఫొటో షూట్‌లకు హార్సిలీహిల్స్ కేంద్రంగా మారింది. ఆదివారం హిల్స్‌పై ఉన్న ఓ ప్రైవేటు రెస్టారెంట్‌లో ఓ కంపెనీ నిర్వహించిన ఈవెంట్‌లో పాల్గొన్న వారు ఆడమగ తేడా లేకుండా డీజే మ్యూజిక్‌కు చిందులు వేశారు. కుటుంబంతో అయినా, బంధుమిత్రులు, వీకెండ్ పార్టీలలో చిల్ అవ్వాలన్నా అందరికీ గుర్తు వచ్చే ప్రదేశం హార్సిలీహిల్స్ సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో కొత్త అనుభూతిని ఇచ్చే, అతి చల్లని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటంతో ఈ కొండ ప్రత్యేకతను సంతరించుకుంది. ఘాట్‌రోడ్డులోని మలుపులలో వాహనాలలో ప్రయాణం, కొండపై ఉన్న వ్యూపాయింట్ల నుంచి చుట్టుపక్కల ప్రదేశాలను చూసినప్పుడు కలిగే అనుభూతి అమోఘమని పలువురు పర్యాటకులు పేర్కొన్నారు.



హిల్స్‌లోని పాత వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలు తిలకిస్తున్న పర్యాటకులు



జూపార్క్ వద్ద జింకలతో సరదాగా పర్యాటకులు

చికెన్ @ 120

- కార్తీకమాసం ఎఫెక్ట్



కురబలకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం కారణంగా ఒక్కసారిగా చికెన్ ధర పడిపోయింది. వ్యాపారాలు కూడా అంతంతమాత్రమే జరుగుతుండటంతో వ్యాపారులు నష్టాలు చవిచూస్తున్నారు. చికెన్‌ప్రియులు మాత్రం ధరల పతనంతో పండుగ చేసుకుంటున్నారు. ప్రతి ఏడాది శ్రావణ, కార్తీక మాసాల్లో చికెన్ ధరలు పతనమవడం సర్వసాధారణమైంది. ఈ మాసాల్లో చాలామంది హిందువులు మాంసాన్ని తినరు. దీంతో చాలావరకు అమ్మకాలు లేకపోవడంతో ధరలు పతనమయ్యాయి. కొద్దిరోజుల క్రితం మార్కెట్‌లో కిలో చికెన్ ధర రూ.220 నుంచి రూ.260 వరకు పలుకుతుండేది. కాగా ప్రస్తుతం ఒక్కసారిగా ధర పడిపోయింది. ఇదివరలో చికెన్‌కు విపరీతమైన డిమాండ్ ఉండగా ప్రస్తుతం కొనుగోళ్లు లేకపోవడంతో దాదాపుగా సగానికి సగం ధరలు పడిపోయాయి. కాగా అంగళ్లు, కురబలకోట మార్కెట్‌లో ఆదివారం కిలో రూ.120 ధర పలికింది. ఎవ్వరూ ఊహించని రీతిలో ఒక్కసారిగా ధరలు పతనమయ్యాయి. కాగా మరికొన్ని రోజుల పాటు ఇదే ధరలు కొనసాగవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- గృహప్రవేశానికి వెళ్తూ అనంతలోకాలకు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- రెండు గ్రామాల్లో విషాదఛాయలు

కాశినాయన/మైదుకూరురూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం ఎద్దోడుకనం వద్ద లారీ ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడిన విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..

కాశినాయన మండలం చిన్నాయపల్లెకు చెందిన గుర్రాల శ్రీనివాసులరెడ్డి ఖాజీపేట మండలం తిప్పాయపల్లెలో కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో అత్తగారి ఊర్లో సోమవారం గృహ ప్రవేశం ఉండడంతో కుమార్తె, భార్యతో కలిసి స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రమే బయలుదేరాడు. కాగా మార్గమధ్యలో మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లె సమీపంలో గల ఎద్దడుకనంకు రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ సంఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న శ్రీనివాసులరెడ్డి (35), భార్య అరుణ (32), కుమార్తె పవిత్ర(12) అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో గంట క్రితం వరకూ గ్రామంలో అందరితో కలియతిరిగిన కుటుంబం ఒక్కసారిగా మృతిచెందారన్న వార్త వినడంతో గ్రామస్తులు, బంధువులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. అటు ఖాజీపేట మండలం తిప్పాయపల్లెలోనూ, ఇటు కాశినాయన మండలం చిన్నాయపల్లెలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. మైదుకూరు సీఐ సయ్యద్‌హసం సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు శ్రీనివాసులరెడ్డికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు జగదీశ్వర్ రెడ్డి తిప్పాయపల్లెలోనే విద్యనభ్యసిస్తుండగా, కుమార్తెను స్వగ్రామమైన కోడిగుడ్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ప్రమాదంలో తల్లిదండ్రి, సోదరి మృతి చెందడంతో జగదీశ్వర్‌రెడ్డి అనాథగా మిగిలాడు.



మృతి చెందిన శ్రీనివాసులరెడ్డి కుటుంబం

కలగానే.. సొంతిల్లు..!

- కొండలు, గుట్టలపై జగనన్న కాలనీలు
- లేఅవుట్లలో వసతుల కొరత
- పూర్తి కాని ఇళ్ల నిర్మాణాలు..
- కొన్నింటిలో పునాదులకే పరిమితం
- కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు

7



చెప్పకుండా చెక్కేశారు..!

- వీరి ఆచూకీ చెప్పరూ..!!
- సచివాలయ సెక్రటరీల తీరిది
- మరికొందరు అడ్మిన్‌లు సెలవులో..
- మదనపల్లె మున్సిపాలిటీలో బేజారు



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

మదనపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జగన్ మానసపుత్రికగా పేరున్న వార్డు సచివాలయాల్లో కొందరు ఉద్యోగులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు సేవలను మరింత చేరువ చేసే క్రమంలో అప్పటి జగన్ ప్రభుత్వం 2019, అక్టోబరు 2న గ్రామ వార్డు సచివాలయాలను ప్రారంభించింది. మొదట్లో భయం, భక్తితో ఉద్యోగ బాధ్యత నిర్వహించే వార్డు సెక్రటరీలు తర్వాత కొందరు ఆ స్థాయిలో పనిచేయడం లేదనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. మరోవైపు ఆయా శాఖల ఉన్నతాధికారులను సైతం కేర్ చేయడం లేదు. మున్సిపాలిటీలో కమిషనర్, మండలాల్లో ఎంపీడీవోలు వీరిని పర్యవేక్షిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీతో పాటు వెల్ఫేర్, ఎడ్యుకేషన్, ప్లానింగ్, అమినిటీ, హెల్త్ అసిస్టెంట్ (ఏఎన్ఎం), శానిటరీ, వీఆర్వో, ఎనర్జీ, మహిళ పోలీస్ ఉన్నారు. వీరిలో అయిదుగురికి మినహా మిగిలిన వారికి పెద్దగా పని లేదనే చెప్పాలి. ఇదిలా ఉండగా విధుల నిర్వహణలో చాలామంది అలసత్వం వహిస్తున్నట్లు ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. పట్టణం, గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా సచివాలయాల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన ఉద్యోగులు కనిపించరు. ఏమని ప్రశ్నిస్తే సర్వేలు, గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ఫీల్డ్‌కు వెళ్లారని చెబుతుంటారు. ఇలా అందుబాటులో లేకపోవడంతో పాటు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా, ఉన్నతాధికారులను సైతం లెక్కచేయని విధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మదనపల్లె మున్సిపాలిటీలోని 35 వార్డుల్లో మొత్తం 44 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 400కుపైగా వార్డు సెక్రటరీలు, ఇతర ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఆరుగురు సెక్రటరీలు ఏడాదిన్నరగా విధులకు హాజరు కావడం లేదు. అలాగని సెలవు పెట్టలేదు. ఉన్నతాధికారులకు చెప్పనూ లేదు. సైలెంట్‌గా చెక్కేశారు. ప్రస్తుతం వీరు ఎక్కడున్నారో, ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే మరో పది మంది అడ్మిన్‌లతో పాటు ఇతర విభాగాల సెక్రటరీలు సెలవులో వెళ్లారు. అధికారుల అనుమతి లేకుండా వెళ్లిపోవడం, తర్వాత ఆన్‌లైన్‌లోనో, రిజిస్టర్ పోస్టులోనో అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరినట్లు డాక్టర్ మెడికల్ సర్టిఫికెట్లు కమిషనర్‌కు పంపుతున్నారు. వీటిని ఎప్పటికప్పుడు తిరస్కరిస్తూ విధులకు హాజరు కావాలని చెబుతున్నా కొందరు కేర్ చేయడం లేదు. వివిధ కారణాలతో మరికొందరు వారంతట వారే సెలవును పొడిగించుకుంటున్నట్లు చెబుతున్నారు. వార్డు సెక్రటరీలు మున్సిపాలిటీకి పంపిన మెడికల్ సర్టిఫికెట్లను మున్సిపల్ అధికారులు మెడికల్ బోర్డుకు రెఫర్ చేస్తుండగా, అవన్నీ బోగస్ అనారోగ్యంగా చెబుతున్నారు. ఈ క్రమంలో ఆ మెడికల్ సర్టిఫికెట్లను జారీ చేసిన డాక్టర్లతో మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ఇలాంటివి ఇక మీదట జారీ చేయొద్దని సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. విధులకు హాజరుకాని, అనుమతి లేకుండా సెలవులో వెళుతున్న వారిపై అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

సచివాలయ ఉద్యోగాల్లో చేరిన వారంతా ఉన్నత విద్యను అభ్యసించిన వారే ఎక్కువగా ఉన్నారు. ఇందులో సాఫ్ట్‌వేర్, ఏంఏ, ఎం.కామ్, ఎమ్మెస్సీ, ఇతర పీజీలు చేసిన వారు ఉన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చిన మొదట్లో చేరినా తర్వాత కొందరు ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాన్వేషణలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా చెప్పకుండా చెక్కేసిన వారంతా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో ఇతర ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. అలాగే చెప్పకుండా సెలవులో వెళ్లిన పదిమంది కూడా పనిభారం, రోజువారీ టార్గెట్లను తట్టుకోలేక మెడికల్ లీవు పెట్టినట్లు తెలిసింది. ఏటా నవంబరు నుంచి జనవరి వరకు మున్సిపాలిటీలో పన్ను వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. ఇందులో సిబ్బంది నుంచి అధికారి వరకు ట్యాక్సు వసూళ్ల టార్గెట్ విధిస్తోంది. ఈ క్రమంలో సచివాలయాల వారీగా మున్సిపాలిటీలోని ఆయా సెక్షన్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఇలా ఇంటింటికీ వెళ్లి కలెక్షన్ చేయడానికి కొందరు ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. మరికొందరు నిజంగానే సమస్య ఉంటూ సెలవు పెట్టిన వారూ ఉన్నారు. ఇక్కడ ఉద్యోగంలో కొనసాగుతూ.. మరోచోట ప్రైవేటు కంపెనీల్లో పనిచేయకూడదు. ఏడాదిన్నరగా విధులకు హాజరు కాని వారిపై ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక మెటర్నిటీ సెలవులో 16 మంది సెక్రటరీలు వెళ్లారు. ఇలా కొందరు విధులకు దూరంగా, మరికొందరు అనుమతి లేకున్నా..సెలవు పెట్టడం, ఇంకొందరు నిజంగా సమస్య వచ్చి వివిధ కారణాలతో లీవులు తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వ సర్వీసులు, టార్గెట్ల పరంగా ఉన్న వారిపైనే భారం పడుతోంది. ఇది ఒక మదనపల్లె మున్సిపాలిటీలోనే కాదు.. జిల్లాలోని మున్సిపాలిటీ, మండల, పంచాయతీ కేంద్రాల్లోనూ ప్రతిచోటా ఇదే పరిస్థితి ఉంది.

నోటీసులు పంపి రప్పిస్తాం..

సచివాలయాల్లో కొందరు ఉద్యోగులు విధులకు హాజరుకాకుండా ఉన్నారు. వారికి నోటీసులు పంపించాం. నోటీసుకు సమాధానం ఇచ్చి జాయిన్ అయితే ఫర్వాలేదు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇంకొందరు డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల ప్రిపరేషన్‌కు వెళ్లినట్లు చెబుతున్నారు. వారికి మెడికల్ లీవు అయిపోయింది. మీ అకౌంట్లో మెడికల్ లీవు లేదు. వచ్చి జాయిన్ కావాలని ఎండార్సుమెంట్ ఇచ్చాం. ఎక్కువగా అడ్మిన్‌లు ఉన్నారు.

- కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్



రామారావు కాలనీలోని సచివాలయం


కంచిపాటివాండ్లపల్లి సమీపంలో గుట్టలో బండరాళ్ల మధ్య వేసిన లేఅవుట్

కలగానే...సొంతిల్లు !


అక్కంపల్లి జగనన్న కాలనీలో మట్టి రోడ్డు

- కొండలు, గుట్టలపై జగనన్న కాలనీలు
- లేఅవుట్లలో వసతులు కొరత
- పూర్తికాని ఇళ్ల నిర్మాణాలు..
- కొన్నింటిలో పునాదులకే పరిమితం
- కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు

సుండుపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పేరిట చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదు. కాలనీలు కాదు. ఏకంగా ఊళ్లు నిర్మిస్తున్నామని అప్పటి పాలకులు చెప్పిన మాటలు నీటి మీద రాతలుగా మిగిలాయి. జగనన్న కాలనీ లేఅవుట్లలో రహదారులు, విద్యుత్, తాగు నీరు తదితర సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారుల సొంతింటి ఆకాంక్ష కలగానే మిగిలింది. వివరాలిలా..

సుండుపల్లె మండలంలో 22 జగనన్న కాలనీలలో లేఅవుట్లు వేశారు. మండల వ్యాప్తంగా 1,145 మంది లబ్ధిదారులకు జగనన్న పేరిట ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. వీరిలో కొంత మందికి యల్లారెడ్డిగారిపల్లె సమీపంలో ఓ రైతు మామిడి తోటలో ప్లాట్లు వేసినట్లు పేరుపైన చూపించారు. అయితే సుమారు 80 మంది ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు అక్కడికి వెళ్లి చూస్తే అక్కడ సుమారు ఐదారు సంవత్సరాల మామిడి చెట్లు పచ్చని పంట పొలాలు దర్శనమిస్తున్నాయి. ఇదం తా గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాయకుల మాటలు విని స్థానిక రైతులను ఇబ్బంది పెట్టేందుకు అప్పటి అధి కారులు చేసినట్లు ఆ తర్వాత అధికారులు గుర్తించారు. అక్కడ ఇంటి నిర్మాణానికి అనువు కాదని మరో చోట ఇస్తామని చెప్పారు. అక్కడ ప్లాట్లు కేటాయించిన లబ్ధిదారులకు ఇంటి స్థలం చూపించలేదు. ఆ లబ్ధిదారులు తమకు పట్టాలిచ్చారు కానీ స్థలం చూపి ంచలేదని అధికారులు దగ్గరికి వెళితే పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. వేరేచోట ఎక్కడైనా ఇంటి స్థలాలు చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటామని చెబుతున్నారు. అలాగే సుండుపల్లెలోని మైనార్టీలు ఇతర నిరుపేదలైన లబ్ధిదారులకు ఊరికి దూరంగా గుట్టల్లో బండలపైన లేఅవుట్లు వేసి పట్టాలు పంపిణీ చేశారు. ఇక్కడి విలువైన స్థలాలను వైసీపీ నాయకులు తమ అనుచరులకు ఇతరులకు అమ్ముకున్నారని విమర్శలు ఉన్నాయి. ఇక మాచిరెడ్డిగారిపల్లె, చిన్నగొల్లపల్లె, పొలిమేర ఎల్లె గ్రామ పంచా యతీల్లో ఇంటి స్థలాల పంపిణీ జరగలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా అర్హులను గుర్తించి ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గృహ నిర్మాణాలపై కలెక్టర్ ఆరా...

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేదల ఇళ్ల నిర్మాణ పనులపై దృష్టి పెట్టింది. నాలుగు రోజుల క్రితం కలెక్టర్ సుండుపల్లె మండలంలో పర్యటించారు. గృహ నిర్మాణాల పురోగతి, మౌలిక వసతులు తదితర అంశాలపై ఆరాతీశారు. ఇంటి నిర్మాణ పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు మూడు నెలలు గడువు పెట్టారు. ఇప్పటికీ రెండు నెలలు ముగిసినా పనుల్లో పెద్దగా పురోగతి లేదు. అప్పట్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించారు. ఇంటి సామాగ్రి ధరలు పెరగడంతో ఇంటి నిర్మాణం భారంగా మారిందని లబ్ధిదారులు చెబు తున్నారు. దీంతో కొందరు మాత్రమే సొంత డబ్బుతో కొన్ని కుటుంబాలు మాత్రం నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నాయి. వసతులు లేకపోవడంతో వీరికి తిప్పలు తప్పడం లేదు. రోడ్లు, సరైన నీటి వసతి లేదు. చాలా లేఅవుట్లలో అసలు ఇంటి నిర్మాణాలే ప్రారంభం కాలేదు. గుట్టల్లో, అడవి ప్రాంతం సమీపంలో, బండలపైన లేఅవుట్లు వేయడంతో లబ్ధిదారులు పునాదులు కూడా వేయలేదు.

స్థలం చూపించలేదు



జగనన్న ఇంటి స్థలం పేరిట పట్టా ఇచ్చారు. స్థలం చూపించడం లేదు. పట్టాలు ఇచ్చి మూడు సంవత్సరాలు అయ్యింది. ఇంటి స్థలం మాత్రం చూపించడం లేదు. స్థలం చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాను. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలి.

- నిర్మలమ్మ, వినాయకనగర్

ఇంటి స్థలం ఇప్పించండి



గత ప్రభుత్వంలో ఇంటి పట్టాలు ఇచ్చి ఇప్పటికీ స్థలం చూపించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభు త్వంలోనైనా ఇంటి స్థలం చూపించండి. ఇంటి నిర్మాణం చేసుకుంటాము. స్థలం చూపించకుండా పట్టాలిచ్చి మాలాంటి నిరుపేదలను వైసీపీ ప్రభు త్వం మోసం చేసింది.

-నాగరాణి, సుండుపల్లె

30 లోపు దరఖాస్తు చేసుకోవాలి



స్థలం ఉండి పక్కా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి స్థలాల కోసం ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ దగ్గర ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలి. సందేహాలు ఉంటే 8309070813 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయండి

-నాగరాజునాయక్, హౌసింగ్ ఏఈ

విద్యుత్ వైర్ తెగిపడి 16 పందులు మృతి


విద్యుత్ వైరు తెగిపడి మృతి చెందిన పందుల వద్ద యజమానులు, ప్రమాదానికి కారణమైన విద్యుత్‌తీగ

రాయచోటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మెయిన్ లైన్ విద్యుత్ వైర్ తెగిపడి 16 పందులు మృతి చెందిన సంఘటన రాయచోటి పట్టణంలో ఆదివారం సాయంత్రం జరిగింది. బాధితుల వివరాల మేరకు.. రాయచోటి పట్టణ పరిధిలోని చిత్తూరు రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా విద్యుత్ వైరు తెగి పడింది. దీంతో ఆ ప్రాంతంలో మేత మేస్తున్న 16 పందులు అక్కడికక్కడే మృతి చెందాయి. అయితే ఆ సమయంలో అక్కడ మనుషులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా మృతి చెందిన పందుల విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని పందుల యజమానులు పెద్ద పోలేరయ్య, శ్రీరాములు, సుంకయ్యలు లబోదిబోమంటున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని. .. అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



చెన్నూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాయపల్లెకు చెందిన డల్లాయి సుధాకర్ (60) కుటుంబ సభ్యులు మందలించారనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుధాకర్ స్థానికంగా వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కుటుంబ పోషణార్థం ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవాడు. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులు అతని ప్రవర్తనపై మందలించడంతో అవమానంగా భావించి.. శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కొందరు 108 వాహనంతో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉద యం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నబీకోటలో ఫ్యానుకు ఉరివేసుకుని..

కడప క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం నబీకోటలో ఆదివారం ఓ వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. వల్లూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన రాజశేఖర్ (29) వాహన డ్రైవరుగా పనిచేస్తూ భార్యతో కలిసి కడప నబీకోటలో నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉండేవి. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. కాగా రాజశేఖర్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ మృతుని సోదరుడు పాలెంపల్లె లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేముల, నవంబరు 24: మండలంలోని భూమయ్యగారిపల్లె క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భూమయ్యగారిపల్లెకు చెందిన గోటూరు రామాంజనేయులు, గోటూరు ఎర్రన్నలు పులివెందుల నుంచి స్వగ్రామానికి ఎక్సెల్ మోటర్ సైకిల్‌పై వెళ్తున్నారు. గ్రామానికి వెళ్లే క్రాస్ వద్దకు రాగానే కడప రూట్ నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరిని అదే కారులో పులివెందులలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నందలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లతిమ్మాయపల్లె గ్రామానికి చెందిన రామిశెట్టి సుబ్బరాయుడు(54) గ్రామ సమీపంలోని చెయ్యేరు ఈత ఆడుతుండగా ప్రమాదవశాత్తు నీటి మునిగిపోయాడు. ఆ ప్రదేశానికి ఈతకు వెళ్లిన కొందరు గమనించి.. అతన్ని బయటకు తీసి 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నందలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'అంతర్జాతీయ స్థాయికి చేరిన జగన్ అవినీతి'


పార్టీలో చేరిన వారితో బీటెక్ రవి

లింగాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి అంతర్జాతీయ స్థాయికి చేరి ఏకంగా అమెరికాలో కూడా కేసు నమోదు అయ్యే పరిస్థితి ఏర్పడిందని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మండలంలోని కామసముద్రం గ్రామంలో ఆదివారం 40కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. గ్రామ సర్పంచు వెంకటనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, రామాంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులకు బీటెక్ రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు అంతర్జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ పరువు పోయేలా జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహారశైలి ఉందన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి బెయిల్‌రద్దు అయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అవినాష్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు ఇవ్వడం, సోషల్ మీడియాలో అసభ్యపోస్టులు పెడుతూ కేసుల్లో ఉన్న వర్రా రవీంద్రారెడ్డి, అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి సర్వేనెబర్ 260/1, 260/2లో అటవీ ప్రాంత భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని, అలాగే తెలంగాణ వ్యక్తి నుంచి కార్లు బాడుగకు తెచ్చుకొని తర్వాత తిరిగి ఇవ్వకుండా అవినాష్‌రెడ్డి మనుషులు బెదిరిస్తూ కార్లను సొంతం చేసుకున్నారని వివరించారు. ఇవన్నీ చూసి ప్రజలు ఇలాంటి వారినా ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నుకున్నామంటూ అసహ్యించు కుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, టీడీపీ మండల నాయకుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ చెస్ సంయుక్త విజేతలుగా అశ్రసుభాని, మల్లేశ్వరరావు


సంయుక్త విజేతలకు బహుమతులను అందిస్తున్న దృశ్యం

కడప స్పోర్ట్స్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెల్లంమండీ వీధిలో గల ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ విభాగ పోటీలలో కడప నగరానికి చెందిన అశ్ర సుభాని, విజయవాడకు చెందిన సీనియర్ కె. మల్లేశ్వరరావు సంయుక్త విజేతలుగా నిలిచారు. పోటీలో వీరిద్దరూ ఏడు రౌండ్లకు గాను 6.5 పాయింట్లు సాధించారు. దీంతో నిర్వాహకులు ఇద్దరిని సంయుక్త విజేతలుగా ప్రకటించారు. ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి విజేతగా ఉమ్మడి కడప జిల్లా జట్టు


జాతీయస్థాయి ఎంపికైన ఉమ్మడి కడప జిల్లా జట్టు

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జరిగిన 68వ రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్ట్ బాల్ బాలుర విభాగం పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. తొలుత కృష్ణ, ప్రకాశం జిల్లా జట్లపై గెలిచి పూల్ విన్నర్‌గా నిలిచింది. అలాగే క్వార్టర్స్ ఫైనల్స్‌లో శ్రీకాకుళం జట్టుపైన, సెమీ ఫైనల్‌లో ఆతిధ్య చిత్తూరు జిల్లాపై, ఫైనల్‌లో విజయన గరం జిల్లా జట్టుపై వరుసగా విజయాలు సాధించుకుంటూ రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది.

జాతీయ స్థాయికి క్రీడాకారుల ఎంపిక : ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటేశు, భవంత్‌సాగర్, సుండుపల్లెకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అభి, రెడ్డివారిపల్లెకు చెందిన రాజేశ్‌లు జాతీయస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. వీరు జనవరిలో మహారాష్ట్రలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారు. అలాగే బాలికల విభాగంలో ఉమ్మడి కడప జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. వారిలో జాతీయ జట్టుకు అనూష, లక్ష్మీప్రసన్న, సన్నీలు ఎంపికైనట్లు మాసాపేట హైస్కూల్ పీడీ జగదీశ్వరయ్య తెలియజేశారు.

హోరాహోరీగా సాగిన ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు

ఈస్ట్ గోదావరి, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల విజయం


మహేంద్రారెడ్డి (95 పరుగులు), అభినవ్ (83 పరుగులు)

కడప స్పోర్ట్స్, నవంబర్ 24, (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆదివారం ఈస్ట్ గోదావరి జట్టు, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు, అనంతపురం జట్టుపై 3 వికెట్లతో విజయం సాధించగా.. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు ప్రకాశం జట్టుపై 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. వివరాలిలా..

కేఓఆర్ఎం మైదానంలోఈస్ట్ గోదావరి-రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 38.5 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో సాయిపూర్ణతేజ 62 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 41.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి విజయానికి అవసరమైన 165 పరుగులు సాధించారు. ఇందులో సూర్యచైతన్య 43, విజయ్ 41 పరుగులు చేశారు. దీంతో ఈస్ట్‌గోదావరి జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు దిగి 49.2 ఓవర్లలో 216 పరుగులు చేసింది. ఇందులో మహేంద్రారెడ్డి 95 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజులో నిలిచారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 46.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 217పరుగులు సాధించింది ఇందులో సుబ్రహ్మణ్యం 73 పరుగులు, శశాంక్ శ్రీవాత్స్ 52 పరుగులు చేసి గెలుపులో కీలక పాత్ర పోషించారు. దీంతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. కేఎస్ఆర్ఎం మైదానంలో ప్రకాశం-రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో ప్రకాశం జట్టు 46.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో అభినవ్ 83 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ 42.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. ఇందులో ఖాజామోహిద్దీన్ 72 పరుగులు, సమన్విత్ 57 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 4 వికెట్ల తేడాతో గెలుపు సాధించింది.

ఫీజుల చెల్లింపుపై ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫీజుల చెల్లింపు విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కళాశాల యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజురీయింబర్స్‌మెంటు సమస్యల కారణంగా హాల్‌టికెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించడం చేయకూడదని తెలిపారు. ఇప్పటికే అన్ని కళాశాలలకు జీవో నోట్ కూడా పంపించామని, జిల్లాలోని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు చెల్లించాలని వత్తిడి తేవడమే కాకుండా హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇదే విషయంపై రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ తీవ్రంగా పరిగణించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘిస్తే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలల సమయం పెంపు సరికాదు : ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సమయాన్ని పెంచడం సరికాదని ఏపీటీఎఫ్‌రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో ప్రతి మండలంలో ఒకఉన్నత పాఠశాలను ఎంపిక చేసి ఉదయం 9 నుంచి 5 వరకు పాఠశాలలు నిర్వహించేలా.. ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఉపాధ్యాయులపై పని వత్తిడి తగ్గించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలరు భాస్కర్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు రాజారావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం నూతన జేఏసీ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు లెక్చరర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జేఏసీ ఛైర్మన్ జానీబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన జేఏసీని ఎంపిక చేశారు. జిల్లా జేఏసీ ఛైర్మన్‌గా జానీబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అలాగే సభ్యులుగా శివరామిరెడ్డి,హరిప్రసాద్‌రెడ్డి, రాధాక్రిష్ణ, అనీష్, సుబ్బయ్య, అమృతాదేవి, రామ్మోహన్‌రెడ్డి, ఇర్ఫాన్, శ్రీనివాసులు, రామలక్ష్మి నాగేంద్ర, ఫక్ృద్దీన్, మధుశ్రీనివాస్, మల్లేశ్వరి తదితరులను ఎంపిక చేశారు.

'గురువుల పాలిట గుదిబండగా బోధనేతర పనులు'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టీచర్ల పాలిట గుదిబండగా మారిన బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాదరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా అధ్యక్షతన జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజుల తరబడి శిక్షణలు, ప్రతిరోజూ రకరకాల యాప్‌ల నిర్వహణతో బోధన ఎలా సజావుగా సాగుతుందో ఆలోచించాలన్నారు. బడిలో అడుగు పెట్టినప్పటి నుంచి టీచర్ల హాజరు, విద్యార్థుల హాజరు, ఆయాల హాజరు రకరకాల యాప్‌లతో అప్‌లోడ్ చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుడు సురేశ్‌బాబు ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, రమణారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన



చిన్నఓరంపాడులో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాజంపేట టౌన్/ ఓబులవారిపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని మన్నూరు ఉన్నత పాఠశాల, ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు పంచాయతీ దిగుపల్లెలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆదివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు నమోదు చేయాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యేవారు కూడా ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే 2025 నుంచి వారిపేరు ఓటరుగా నమోదు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు పీరు మున్నీ, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట మార్గం.. యమడేంజర్!

- ముగ్గురాయి తరలింపులో నిర్లక్ష్యం
- పేరుకుపోయిన రాళ్లు, బురద, దుమ్ము
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- నిద్రావస్థలో అధికారులు



డోర్ వేసుకోకుండా వెళుతున్న లారీ

ఓబులవారిపల్లె, నవబంరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ముగురాళ్ల గనులున్న మంగంపేట సమీపంలోని కడప - చెన్నై జాతీయ రహదారిలో ప్రయాణించాలంటేనే గుండెల్లో గుబులు రేకెత్తుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎండీసీ సంస్థ నుంచి ముగ్గురాళ్లను కొనుగోలు చేసిన కంపెనీలు వాటిని పల్వరైజింగ్ మిల్లులకు లారీల ద్వారా తరలిస్తుంటారు. ఈ తరలింపు ప్రక్రియలో కనీస నియమ నిబంధనలు పాటించకపోవడంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏపీఎండీసీ సంస్థ నుంచి ముగ్గురాళ్లను కొనుగోలు చేసిన వ్యాపారులు వాటిని డిస్పాచ్ అనుమతించిన తర్వాత తరలించేందుకు ఏర్పాట్లు చేస్తారు. ముగ్గురాళ్లలోడుతో వెళ్లే వాహనాల కారణంగా దుమ్ము రేగకుండా సంస్థ నుంచి హైవే మీదకు వెళ్లే వరకు ఉన్న రోడ్డులో మాత్రం నీళ్లు చల్లించి చేతులు దులుపుకుంటారు. ఇక్కడి నుంచే వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు ప్రారంభమవుతాయి. ముగ్గురాయిని తరలించే వాహనాల్లో ఎక్కువశాతం వెనుక డోర్ ఉండదు. అన్‌లోడింగ్ సమయంలో పని సులభం కావడంతోపాటు, సమయం కలిసి వస్తుందన్న ఉద్దేశంతో లారీల నిర్వాహకులు ఉద్దేశపూర్వకంగానే వెనుక డోర్ తొలగిస్తుంటారని డ్రైవర్లు చెబుతున్నారు. దీంతో ముగ్గురాళ్లు, వాటిలోని మట్టి, దుమ్ము జారి రోడ్డుపై పడిపోతుంటుంది. వాహనాల రద్దీ కారణంగా ఈ దుమ్ము రేగి రోడ్డు పక్క ఉన్న చెట్లు, పొలాలపై పేరుకుపోతుంటుంది. వాహనాల వెనుక దారి కనిపించనంతగా దుమ్ము మేఘాలు ఏర్పడుతుంటాయి. ఈ నేపథ్యంలో ఏపీఎండీసీ సంస్థ నుంచి లారీలు వేగంగా హైవే మీదకు రావడం, సిగ్నల్స్ చూపకుండానే వెళుతుండడంతో ఆయా వాహనాలు వెళుతున్నాయో, ఆగుతున్నాయో, మీదకు వస్తున్నాయో తెలియక వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. భారీలోడుతో అతివేగంగా వెళ్లే లారీల వెనుక రేగే దుమ్ము కారణంగా వాటి వెనుక వెళుతున్న చిన్న చిన్న వాహనాలు, ద్విచక్ర వాహనదారులు దారి కనిపించక అవస్థలపాలవుతున్నారు. దీంతో మంగంపేట ప్రాంతం దాటేవరకు గుండెల్ని అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడుతోందని వాహనదారులు అంటున్నారు. ఇక దుమ్ము కళ్లల్లో పడడం కారణంగా నిద్ర కూడా సరిగా పట్టడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మిల్లులు, లారీ యజమానులు రోడ్లపై దుమ్ము ధూళి, రాళ్ల పడకుండా, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల పొదలను తొలగిస్తే లారీలు వచ్చినపుడు పక్కకు తొలగేందుకు అవకాశం ఉంటుందని ఇతర వాహనదారులు అంటున్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం ప్రభుత్వ ధ్యేయం

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు రాయచోటి పట్టణంలోని ఎస్‌ఎన్ కాలనీలో ఓ ప్రైవేటు ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పటిష్టంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బయారెడ్డి, నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

చిట్వేలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఏబీఎన్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని ఎన్‌సీసీ విద్యార్థులకు సూచించారు. హవల్దార్ అరిస్టాటిల్ ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాలను శుభ్రపరిచి మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు చంద్రయ్య, దుర్గరాజు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌రాజు, ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్నారు.

సర్తాజ్‌కు దేవనాగరి హిందీ సేవీ సమ్మాన్

రాజంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణానికి చెందిన ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ దేవనాగరి హిందీ సేవీ సమ్మాన్ అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్ర భాష సేవా సంఘ్ ఫౌండేషన్ ప్రతియేటా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హిందీ ప్రచారం, అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ఈ పురస్కారాలు అందజేస్తారు. 2024కు ఈ అవార్డుకు సర్తాజ్ ఎంపిక కాగా, డిసెంబరు 1న హైదరాబాదులో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. సర్తాజ్ హుస్సేన్ ప్రస్తుతం పుల్లంపేట మండలం టి.కమ్మపల్లె జడ్పీ హైస్కూలులో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

జనచైతన్య సంఘం నేత విగ్రహా ప్రతిష్ఠ

రామాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయం సర్కిల్‌లో ఆదివారం జనచైతన్య సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌నాయుడు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి ఆయన చేసిన సేవలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజ



పూజలందుకున్న అయ్యప్పస్వామి

నందలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లెలో గోవిందాంబ సమేత జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం టీవీ రత్నం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి లక్షార్చన చేశారు. ఉదయం ఐదు గంటలకు పంచామృతాభిషేకం, ఏడు గంటలకు మహాగణపతిపూజ హోమం, 8.30కి లక్షార్చన, 11 గంటలకు పడిపూజ చేశారు. .

తోపుడు బండ్లు, చిరు వ్యాపారులతో ట్రాఫిక్ సమస్య

● పరిశీలించిన డీపీవో బాలకృష్ణారెడ్డి



రోడ్డుపక్కన కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న డీపీవో బాలకృష్ణారెడ్డి

సుండుపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల దుకాణాల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని డీపీవో బాలకృష్ణారెడ్డి సూచించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై స్థానికులు కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలో డీపీవో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు తమ దుకాణాల ఎదుట ఉన్న స్థలాన్ని తోపుడు బండ్ల వ్యాపారులకు బాడుగలకు ఇవ్వడం ట్రాఫిక్ సమస్యకు కారణమని, అలా బండ్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంటనే సంబంధిత పంచాయతీ అధికారులు ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రోడ్లు, డ్రైనేజీలు ఇతర సమస్యలను స్థానిక ప్రజలు, కూటమి నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, టీడీపీ నాయకులు శివరాం నాయుడు, సురేశ్ నాయుడు, బీజేపీ నాయకులు రామా జగదీశ్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బలిజలు సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలి



లక్కిరెడ్డిపల్లె: సుగవాసి బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న నవ్యాంధ్ర బలిజ సంఘం సభ్యులు



రైల్వేకోడూరు: కాపు నేతలను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బలిజలు సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్య, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాదుబాబు పిలుపునిచ్చారు. ఆదివారం లక్కిరెడిపల్లె దాసిరెడ్డి మిట్టన ఏర్పాటు చేసిన కార్తీక వన భోజనం కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బలిజల ఆర్థికాభివృద్ధికి సంఘం చేయూతనివాలన్నారు. పేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు తెలుగుదేశం ప్రభుత్వంలో బలిజ లకు మంచి రోజులు వస్తాయని అందరం కలసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కాపుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తా రన్నారు. ప్రసాదుబాబు మాట్లాడుతూ బలిజలు సామాజికంగా రాజకీయంగా ఎదగాలంటే ఐకమత్యం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాధాకృష్ణయ్య, రేఖం నారాయణ, సుగవాసి శ్రీనివాసులు, కావలి ఆంజనేయులు, తుపాకుల చంద్ర, మన్నేరు రామాంజనేయులు, పసుపులేటి నాగేంద్ర, జనసేన రాయకురాలు రెడ్డిరాణి, ఏనుగుల విశ్వనాథ, మాజీ సర్పంచు రాజా, పవన్, బడిశెట్టి రవి, నవ్యాంధ్ర కాపు సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: బలిజలు పోరాట యోధులని ఉమ్మడి కడప జిల్లా కాపు నేత పీవీఎస్ మూర్తి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరులోని విజయా కన్వెన్షన్ హాలులో నిర్వహించిన బలిజల కార్తీక వన భోజన కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. బలిజలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ బలిజలు ఐక్యత చాటుకుంటే ఎదురే ఉండదని తెలిపారు. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ జనసేనతోనే బలిజలకు రాజ్యాధికారం సాధ్యం అవుతుందన్నారు. అన్నమయ్య విద్యాసంస్థల చైర్మన్ మోదుగుల పెంచలయ్య, గీతాంజలి రమణ, అతికారి కృష్ణ, అతికారి వెంకటయ్య తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు ముగ్గురాళ్ల అన్నప్ప, కల్లా చలపతి, గునిపాటి రాయుడు, నల్లంశెట్టి యానాదయ్య, గుగ్గిళ్ల సుబ్బరాయుడు, ముద్దపోలు సభాపతి, ఉత్తరాది శివకుమార్, సాయం శ్రీధర్, సీహెచ్ రమేష్‌బాబు, మందల నాగేంద్ర, అంబటి మురళి, వరికూటి నాగరాజు, పాలా చలపతి, తిరుపతి బోత్ ఆస్పత్రి అధినేత పసుపులేటి హరిప్రసాద్, నార్జాల హేమరాజ్, మర్రి రెడ్డయ్య, గంధంశెట్టి దినకర్ తదితరులు పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్' కరపత్రాల ఆవిష్కరణ

రాజంపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాపాడాలంటూ ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ రాజంపేట ఆర్ అండ్ బీ బంగ్లా ఎదుట ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్, భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సూరి, ఏఐటీయూసీ కార్యదర్శి సికిందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నామని అందులో భాగంగా రాయచోటి కలెక్టరేట్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లి పంచాయతీ రాజీవ్‌కాలనీలో సిమెంటు రోడ్డు పనులను రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజ కవర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులు ముమ్మరం చేశామన్నారు. ఈ పంచాయతీకి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేయించామన్నారు. పనులన్నీ నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దవటంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



పనులు పరిశీలిస్తున్న మండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్

సిద్దవటం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఆదివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. కడపాయపల్లె, టక్కోలు గ్రామ పంచాయతీల్లో పనులను మండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామీణులు చెత్తా చెదారాన్ని వీధుల్లో పడేయకుండా గ్రీన్ అంబాసిడర్ వాహనంలో హరిత రాయబారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్ర టరీలు శివయ్య, వెంకటేశ్, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె పంచాయతీలోని దేవళంపల్లెలో చెన్నకేశవస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి, చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లె లక్ష్మీప్రసాదురెడ్డి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు యలమల మదన్‌మోహన్, కమిటీ సభ్యులు వీరాంజనేయులు, రామాంజనేయులు, చెన్నకేశవులు, కృష్ణ, సుధీర్‌బాబు, సిద్ధక వెంకటరామిరెడ్డి, దేవనాథ రెడ్డి, మండ్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

లంకమల అడవుల్లో ఫారెస్ట్ సిబ్బంది కూంబింగ్



లంకమల్ల అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది

సిద్దవటం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి లోని లంకమలఅటవీ ప్రాంతంలో అటవీ శాఖ సిబ్బంది ఆదివారం కూంబింగ్ చేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి మాట్లాడుతూ అటవీ సంపద తరలి పోకుండా గొల్లపల్లె, సిద్దవటం, రోళ్లబోడు బీట్ వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అనుమానిత వ్యక్తుల సంచారంపై తమకు సమాచారం అందించాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఎఫ్‌బీవో ఆదివిశ్వనాథ్, మధు, ప్రొటెక్షన్ వాచర్లు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్: ముగ్గురికి గాయాలు

నందలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం గుండ్లూరు నుంచి సిమెంటు ఇటుక దిమ్మెలతో ఒంటిమిట్టకు వెళుతున్న ట్రాక్టర్‌ను కడప నుంచి తిరుపతికి వెళుతున్న కంటైనర్ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై నందలూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

● మూడు పందెం కోళ్లు, రూ.26,200నగదు స్వాధీనం

ఓబులవారిపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రాంతాల్లోని పేకాట, కోడిపందెం కేంద్రాల్లో దాడులు చేసి మూడు కోళ్లతోపాటు, రూ. 26,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్ తెలిపారు. టీపీ రాజుపల్లె గ్రామ పంచాయతీ చిన్నరాజుపల్లె గ్రామ సరిహద్దుల్లో కంపచెట్లల్లో పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 22,600 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. కొర్లకుంట చెరువు సమీపంలో కోడిపందెం ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 3 కోళ్లను, 3600 రూపాయలు నగదు స్వాధీనం చేసుకు న్నామని వివరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న అఖిలభారత యాదవ సంఘం అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ సంఘం జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య పిలుపునిచ్చారు. పదిలం మహేశ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం కడప, అన్నమయ్య జిల్లాల యాదవుల సమైక్య సభ నిర్వహించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు పదిలం జగన్నాథం యాదవ్‌ను సేల్స్ టాక్స్ ఏఈవో విజయలక్ష్మి యాదవ్, లక్కిరెడ్డిపల్లె జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యర్రగోళ్ల పెద్ద రెడ్డెయ్య యాదవ్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగాదేవి, గంగయ్య సన్మానించారు. అనంతపురం జడ్పీ సీఈవో వెంకటసుబ్బయ్య యాదవ్, చెక్కా రమేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్య బీమా హామీ నెరవేర్చాలి

చిట్వేలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా హామీ నెరవేర్చాలని రైతు సంఘం నాయకుడు మలిశెట్టి జతిన్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యబీమాను పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు, నెలకు 50 వేలు జీతం తీసుకునే ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలను కూడా వర్తింపజేయాలని కోరారు. గాలేరు - నగిరిని కూడా హంద్రీనీవాతో పాటే పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

టీడీపీ సభ్యత్వం భవిష్యత్తుకు భరోసా

రామాపురం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కోటిరెడ్డి అన్నారు. మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీలో ఆదివారం వారు టీడీపీ సభ్యత్వాలు నమోదు చేశారు. రామాంజుల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మస్తాన్, భాస్కర్, నాగేంద్ర, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో రైల్వేకోడూరు పట్టణంలో బీజేపీ నాయకులు ఆదివారం విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కత్తిరించిసంబరాలు చేసుకున్నారు. నాయకులు వాకచర్ల సుబ్బారావు, ఊటుకూరు చలపతి, బత్తల హరి, ఆయపాటి గౌరీ కుమార్, కాళప్పగారి రాము తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: స్థానిక పాతబస్టాండు కూడలిలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. నాయకులు ఆకేపాటి వెంకటరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు బాపూజీ, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు ఆదిలక్షుమ్మ, నాగేశ్వరరావు, నిర్మల, చంద్రశేఖర్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, హరి, లక్ష్మి, నరసింహులు, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయం ఆధ్వర్యంలో వనభోజనాలు



ఉసిరిక చెట్టు కింద శివపార్వతులకు పూజలు చేస్తున్న అర్చకులు

రాయచోటిటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం ఈవో వెంకట్రమణారెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబల్లి మండలం ఒదివీడు కస్పాకు సమీపంలో మాండవ్యనది తీరంలోని శివాలయం ఆవరణలో ఉసిరిక చెట్టుకింద శివపార్వతులకు, గౌరమ్మకు పూజలు నిర్వహించారు. వనభోజనం ప్రాచుర్యాన్ని భక్తులకు వివరించారు. అనంతరం గౌరమ్మ ప్రతిమకు పూజలు చేసి, హారతులిచ్చి మాండవ్య నదిలో నిమజ్జనం చేశారు. మహిళలు దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. అర్చకులు శంకరస్వామి, నాగేశ్వరస్వామి, శేఖర్‌స్వామి, హరిస్వామి, భజన గురువు తుమ్మల హరినాథ్, ఆలయ సిబ్బంది కొండయ్య, పవన్, శ్రీకాంత్, మల్లి తదితరులు పాల్గొన్నారు.


కంచిపాటివాండ్లపల్లి సమీపంలో గుట్టలో బండరాళ్ల మధ్య వేసిన లేఅవుట్

కలగానే...సొంతిల్లు !


అక్కంపల్లి జగనన్న కాలనీలో మట్టి రోడ్డు

- కొండలు, గుట్టలపై జగనన్న కాలనీలు
- లేఅవుట్లలో వసతులు కొరత
- పూర్తికాని ఇళ్ల నిర్మాణాలు..
- కొన్నింటిలో పునాదులకే పరిమితం
- కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు

సుండుపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పేరిట చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదు. కాలనీలు కాదు. ఏకంగా ఊళ్లు నిర్మిస్తున్నామని అప్పటి పాలకులు చెప్పిన మాటలు నీటి మీద రాతలుగా మిగిలాయి. జగనన్న కాలనీ లేఅవుట్లలో రహదారులు, విద్యుత్, తాగు నీరు తదితర సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారుల సొంతింటి ఆకాంక్ష కలగానే మిగిలింది. వివరాలిలా..

సుండుపల్లె మండలంలో 22 జగనన్న కాలనీలలో లేఅవుట్లు వేశారు. మండల వ్యాప్తంగా 1,145 మంది లబ్ధిదారులకు జగనన్న పేరిట ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. వీరిలో కొంత మందికి యల్లారెడ్డిగారిపల్లె సమీపంలో ఓ రైతు మామిడి తోటలో ప్లాట్లు వేసినట్లు పేరుపైన చూపించారు. అయితే సుమారు 80 మంది ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు అక్కడికి వెళ్లి చూస్తే అక్కడ సుమారు ఐదారు సంవత్సరాల మామిడి చెట్లు పచ్చని పంట పొలాలు దర్శనమిస్తున్నాయి. ఇదంతా గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాయకుల మాటలు విని స్థానిక రైతులను ఇబ్బంది పెట్టేందుకు అప్పటి అధి కారులు చేసినట్లు ఆ తర్వాత అధికారులు గుర్తించారు. అక్కడ ఇంటి నిర్మాణానికి అనువు కాదని మరో చోట ఇస్తామని చెప్పారు. అక్కడ ప్లాట్లు కేటాయించిన లబ్ధిదారులకు ఇంటి స్థలం చూపించలేదు. ఆ లబ్ధిదారులు తమకు పట్టాలిచ్చారు కానీ స్థలం చూపి ంచలేదని అధికారులు దగ్గరికి వెళితే పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. వేరేచోట ఎక్కడైనా ఇంటి స్థలాలు చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటామని చెబుతున్నారు. అలాగే సుండుపల్లెలోని మైనార్టీలు ఇతర నిరుపేదలైన లబ్ధిదారులకు ఊరికి దూరంగా గుట్టల్లో బండలపైన లేఅవుట్లు వేసి పట్టాలు పంపిణీ చేశారు. ఇక్కడి విలువైన స్థలాలను వైసీపీ నాయకులు తమ అనుచరులకు ఇతరులకు అమ్ముకున్నారని విమర్శలు ఉన్నాయి. ఇక మాచిరెడ్డిగారిపల్లె, చిన్నగొల్లపల్లె, పొలిమేర ఎల్లె గ్రామ పంచా యతీల్లో ఇంటి స్థలాల పంపిణీ జరగలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా అర్హులను గుర్తించి ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గృహ నిర్మాణాలపై కలెక్టర్ ఆరా...

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేదల ఇళ్ల నిర్మాణ పనులపై దృష్టి పెట్టింది. నాలుగు రోజుల క్రితం కలెక్టర్ సుండుపల్లె మండలంలో పర్యటించారు. గృహ నిర్మాణాల పురోగతి, మౌలిక వసతులు తదితర అంశాలపై ఆరాతీశారు. ఇంటి నిర్మాణ పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు మూడు నెలలు గడువు పెట్టారు. ఇప్పటికీ రెండు నెలలు ముగిసినా పనుల్లో పెద్దగా పురోగతి లేదు. అప్పట్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించారు. ఇంటి సామాగ్రి ధరలు పెరగడంతో ఇంటి నిర్మాణం భారంగా మారిందని లబ్ధిదారులు చెబు తున్నారు. దీంతో కొందరు మాత్రమే సొంత డబ్బుతో కొన్ని కుటుంబాలు మాత్రం నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నాయి. వసతులు లేకపోవడంతో వీరికి తిప్పలు తప్పడం లేదు. రోడ్లు, సరైన నీటి వసతి లేదు. చాలా లేఅవుట్లలో అసలు ఇంటి నిర్మాణాలే ప్రారంభం కాలేదు. గుట్టల్లో, అడవి ప్రాంతం సమీపంలో, బండలపైన లేఅవుట్లు వేయడంతో లబ్ధిదారులు పునాదులు కూడా వేయలేదు.

స్థలం చూపించలేదు



జగనన్న ఇంటి స్థలం పేరిట పట్టా ఇచ్చారు. స్థలం చూపించడం లేదు. పట్టాలు ఇచ్చి మూడు సంవత్సరాలు అయ్యింది. ఇంటి స్థలం మాత్రం చూపించడం లేదు. స్థలం చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాను. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలి.

- నిర్మలమ్మ, వినాయకనగర్

ఇంటి స్థలం ఇప్పించండి



గత ప్రభుత్వంలో ఇంటి పట్టాలు ఇచ్చి ఇప్పటికీ స్థలం చూపించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభు త్వంలోనైనా ఇంటి స్థలం చూపించండి. ఇంటి నిర్మాణం చేసుకుంటాము. స్థలం చూపించకుండా పట్టాలిచ్చి మాలాంటి నిరుపేదలను వైసీపీ ప్రభు త్వం మోసం చేసింది.

-నాగరాణి, సుండుపల్లె

30 లోపు దరఖాస్తు చేసుకోవాలి



స్థలం ఉండి పక్కా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి స్థలాల కోసం ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ దగ్గర ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలి. సందేహాలు ఉంటే 8309070813 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయండి

-నాగరాజునాయక్, హౌసింగ్ ఏఈ

విద్యుత్ వైర్ తెగిపడి 16 పందులు మృతి


విద్యుత్ వైరు తెగిపడి మృతి చెందిన పందుల వద్ద యజమానులు, ప్రమాదానికి కారణమైన విద్యుత్‌తీగ

రాయచోటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మెయిన్ లైన్ విద్యుత్ వైర్ తెగిపడి 16 పందులు మృతి చెందిన సంఘటన రాయచోటి పట్టణంలో ఆదివారం సాయంత్రం జరిగింది. బాధితుల వివరాల మేరకు.. రాయచోటి పట్టణ పరిధిలోని చిత్తూరు రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా విద్యుత్ వైరు తెగి పడింది. దీంతో ఆ ప్రాంతంలో మేత మేస్తున్న 16 పందులు అక్కడికక్కడే మృతి చెందాయి. అయితే ఆ సమయంలో అక్కడ మనుషులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా మృతి చెందిన పందుల విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని పందుల యజమానులు పెద్ద పోలేరయ్య, శ్రీరాములు, సుంకయ్యలు లబోదిబోమంటున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని. .. అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



చెన్నూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాయపల్లెకు చెందిన డల్లాయి సుధాకర్ (60) కుటుంబ సభ్యులు మందలించారనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుధాకర్ స్థానికంగా వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కుటుంబ పోషణార్థం ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవాడు. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులు అతని ప్రవర్తనపై మందలించడంతో అవమానంగా భావించి.. శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కొందరు 108 వాహనంతో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నబీకోటలో ఫ్యానుకు ఉరివేసుకుని..

కడప క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం నబీకోటలో ఆదివారం ఓ వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. వల్లూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన రాజశేఖర్ (29) వాహన డ్రైవరుగా పనిచేస్తూ భార్యతో కలిసి కడప నబీకోటలో నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉండేవి. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. కాగా రాజశేఖర్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ మృతుని సోదరుడు పాలెంపల్లె లక్ష్మినారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేముల, నవంబరు 24: మండలంలోని భూమయ్యగారిపల్లె క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భూమయ్యగారిపల్లెకు చెందిన గోటూరు రామాంజనేయులు, గోటూరు ఎర్రన్నలు పులివెందుల నుంచి స్వగ్రామానికి ఎక్సెల్ మోటర్ సైకిల్‌పై వెళ్తున్నారు. గ్రామానికి వెళ్లే క్రాస్ వద్దకు రాగానే కడప రూట్ నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరిని అదే కారులో పులివెందులలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నందలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లతిమ్మాయపల్లె గ్రామానికి చెందిన రామిశెట్టి సుబ్బరాయుడు(54) గ్రామ సమీపంలోని చెయ్యేరు ఈత ఆడుతుండగా ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. ఆ ప్రదేశానికి ఈతకు వెళ్లిన కొందరు గమనించి.. అతన్ని బయటకు తీసి 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నందలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'అంతర్జాతీయ స్థాయికి చేరిన జగన్ అవినీతి'


పార్టీలో చేరిన వారితో బీటెక్ రవి

లింగాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి అంతర్జాతీయ స్థాయికి చేరి ఏకంగా అమెరికాలో కూడా కేసు నమోదు అయ్యే పరిస్థితి ఏర్పడిందని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మండలంలోని కామసముద్రం గ్రామంలో ఆదివారం 40కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. గ్రామ సర్పంచు వెంకటనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, రామాంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులకు బీటెక్ రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు అంతర్జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ పరువు పోయేలా జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహారశైలి ఉందన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి బెయిల్‌రద్దు అయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అవినాష్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు ఇవ్వడం, సోషల్ మీడియాలో అసభ్యపోస్టులు పెడుతూ కేసుల్లో ఉన్న వర్రా రవీంద్రారెడ్డి, అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి సర్వేనెబర్ 260/1, 260/2లో అటవీ ప్రాంత భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని, అలాగే తెలంగాణ వ్యక్తి నుంచి కార్లు బాడుగకు తెచ్చుకొని తర్వాత తిరిగి ఇవ్వకుండా అవినాష్‌రెడ్డి మనుషులు బెదిరిస్తూ కార్లను సొంతం చేసుకున్నారని వివరించారు. ఇవన్నీ చూసి ప్రజలు ఇలాంటి వారినా ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నుకున్నామంటూ అసహ్యించు కుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, టీడీపీ మండల నాయకుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ చెస్ సంయుక్త విజేతలుగా అశ్రసుభాని, మల్లేశ్వరరావు


సంయుక్త విజేతలకు బహుమతులను అందిస్తున్న దృశ్యం

కడప స్పోర్ట్స్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెల్లంమండీ వీధిలో గల ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ విభాగ పోటీలలో కడప నగరానికి చెందిన అశ్ర సుభాని, విజయవాడకు చెందిన సీనియర్ కె. మల్లేశ్వరరావు సంయుక్త విజేతలుగా నిలిచారు. పోటీలో వీరిద్దరూ ఏడు రౌండ్లకు గాను 6.5 పాయింట్లు సాధించారు. దీంతో నిర్వాహకులు ఇద్దరిని సంయుక్త విజేతలుగా ప్రకటించారు. ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి విజేతగా ఉమ్మడి కడప జిల్లా జట్టు


జాతీయస్థాయి ఎంపికైన ఉమ్మడి కడప జిల్లా జట్టు

రాయచోటిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జరిగిన 68వ రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్ట్ బాల్ బాలుర విభాగం పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. తొలుత కృష్ణ, ప్రకాశం జిల్లా జట్లపై గెలిచి పూల్ విన్నర్‌గా నిలిచింది. అలాగే క్వార్టర్స్ ఫైనల్స్‌లో శ్రీకాకుళం జట్టుపైన, సెమీ ఫైనల్‌లో ఆతిథ్య చిత్తూరు జిల్లాపై, ఫైనల్‌లో విజయన గరం జిల్లా జట్టుపై వరుసగా విజయాలు సాధించుకుంటూ రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది.

జాతీయ స్థాయికి క్రీడాకారుల ఎంపిక : ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటేశు, భవంత్‌సాగర్, సుండుపల్లెకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అభి, రెడ్డివారిపల్లెకు చెందిన రాజేశ్‌లు జాతీయస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. వీరు జనవరిలో మహారాష్ట్రలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారు. అలాగే బాలికల విభాగంలో ఉమ్మడి కడప జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. వారిలో జాతీయ జట్టుకు అనూష, లక్ష్మిప్రసన్న, సన్నీలు ఎంపికైనట్లు మాసాపేట హైస్కూల్ పీడీ జగదీశ్వరయ్య తెలియజేశారు.

హోరాహోరీగా సాగిన ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు

ఈస్ట్ గోదావరి, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల విజయం


మహేంద్రారెడ్డి (95 పరుగులు), అభినవ్ (83 పరుగులు)

కడప స్పోర్ట్స్, నవంబర్ 24, (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆదివారం ఈస్ట్ గోదావరి జట్టు, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు, అనంతపురం జట్టుపై 3 వికెట్లతో విజయం సాధించగా.. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు ప్రకాశం జట్టుపై 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. వివరాలిలా..

కేఓఆర్ఎం మైదానంలోఈస్ట్ గోదావరి-రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 38.5 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో సాయిపూర్ణతేజ 62 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 41.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి విజయానికి అవసరమైన 165 పరుగులు సాధించారు. ఇందులో సూర్యచైతన్య 43, విజయ్ 41 పరుగులు చేశారు. దీంతో ఈస్ట్‌గోదావరి జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు దిగి 49.2 ఓవర్లలో 216 పరుగులు చేసింది. ఇందులో మహేంద్రారెడ్డి 95 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజులో నిలిచారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 46.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 217పరుగులు సాధించింది ఇందులో సుబ్రహ్మణ్యం 73 పరుగులు, శశాంక్ శ్రీవాత్స్ 52 పరుగులు చేసి గెలుపులో కీలక పాత్ర పోషించారు. దీంతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. కేఎస్ఆర్ఎం మైదానంలో ప్రకాశం-రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో ప్రకాశం జట్టు 46.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో అభినవ్ 83 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ 42.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. ఇందులో ఖాజామొహిద్దీన్ 72 పరుగులు, సమన్విత్ 57 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 4 వికెట్ల తేడాతో గెలుపు సాధించింది.

ఫీజుల చెల్లింపుపై ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫీజుల చెల్లింపు విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కళాశాల యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజురీయింబర్స్‌మెంటు సమస్యల కారణంగా హాల్‌టికెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించడం చేయకూడదని తెలిపారు. ఇప్పటికే అన్ని కళాశాలలకు జీవో నోట్ కూడా పంపించామని, జిల్లాలోని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు చెల్లించాలని వత్తిడి తేవడమే కాకుండా హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇదే విషయంపై రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ తీవ్రంగా పరిగణించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘిస్తే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలల సమయం పెంపు సరికాదు : ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సమయాన్ని పెంచడం సరికాదని ఏపీటీఎఫ్‌రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో ప్రతి మండలంలో ఒక ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి ఉదయం 9 నుంచి 5 వరకు పాఠశాలలు నిర్వహించేలా.. ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఉపాధ్యాయులపై పని వత్తిడి తగ్గించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలరు భాస్కర్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు రాజారావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం నూతన జేఏసీ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు లెక్చరర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జేఏసీ ఛైర్మన్ జానీబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన జేఏసీని ఎంపిక చేశారు. జిల్లా జేఏసీ ఛైర్మన్‌గా జానీబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అలాగే సభ్యులుగా శివరామిరెడ్డి,హరిప్రసాద్‌రెడ్డి, రాధాక్రిష్ణ, అనీష్, సుబ్బయ్య, అమృతాదేవి, రామ్మోహన్‌రెడ్డి, ఇర్ఫాన్, శ్రీనివాసులు, రామలక్ష్మి నాగేంద్ర, ఫక్రుద్దీన్, మధుశ్రీనివాస్, మల్లేశ్వరి తదితరులను ఎంపిక చేశారు.

'గురువుల పాలిట గుదిబండగా బోధనేతర పనులు'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టీచర్ల పాలిట గుదిబండగా మారిన బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాదరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా అధ్యక్షతన జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజుల తరబడి శిక్షణలు, ప్రతిరోజూ రకరకాల యాప్‌ల నిర్వహణతో బోధన ఎలా సజావుగా సాగుతుందో ఆలోచించాలన్నారు. బడిలో అడుగు పెట్టినప్పటి నుంచి టీచర్ల హాజరు, విద్యార్థుల హాజరు, ఆయాల హాజరు రకరకాల యాప్‌లతో అప్‌లోడ్ చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుడు సురేశ్‌బాబు ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, రమణారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వనభోజనాలు


ఉసిరిక చెట్టు కింద శివపార్వతులకు పూజలు చేస్తున్న అర్చకులు

రాయచోటిటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం ఈవో వెంకట్రమణారెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబల్లి మండలం ఒడివీడు కస్పాకు సమీపంలో మాండవ్యనది తీరంలోని శివాలయం ఆవరణలో ఉసిరిక చెట్టుకింద శివ పార్వతులకు, గౌరమ్మకు పూజలు నిర్వహించారు. వనభోజనం ప్రాచుర్యాన్ని భక్తులకు వివరించారు. అనంతరం గౌరమ్మ ప్రతిమకు పూజలు చేసి, హారతులిచ్చి మాండవ్య నదిలో నిమజ్జనం చేశారు. మహిళలు దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. అర్చకులు శంకరస్వామి, నాగేశ్వరస్వామి, శేఖర్‌స్వామి, హరిస్వామి, భజన గురువు తుమ్మల హరినాథ్, ఆలయ సిబ్బంది కొండయ్య, పవన్, శ్రీకాంత్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో తల్లి పై దాడి

పెద్దమండ్యం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) మద్యం మత్తులో వృద్ధ తల్లిపై కొడుకు దాడి చేసిన సంఘటన పెద్దమండ్య మండలం సి.గొల్లపల్లి లో ఆదివారం జరిగింది. పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లిలో బోడెం పెద్దన్న ఓబులమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం పెద్దన్న మృతి చెందాడు. మద్యానికి బానిసైన చిన్న కుమారుడు ఓబులేసు తల్లి ఓబులమ్మ(60)ను డబ్బుల కోసం వేధింప సాగాడు. దీంతో ఆమె డబ్బులు ఇవ్వలేదని కర్రతో దాడి చేసి తలకు, కాళ్లపై క్రూరంగా కొట్టడంతో రక్తమడుగుల్లో పడిపోయింది. గ్రామస్థులు గుర్తించి పెద్దమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చి ఓబులమ్మను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. వృద్ధురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దమండ్యం ఎస్‌ఐ పీవీ రమణ వెల్లడించారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పుంగనూరు పట్టణం కల్లుపల్లె సర్కిల్‌కు చెందిన పద్మావతి(65) అనే వృద్ధురాలు గాయపడ్డారు. ఇంటి నుంచి నడుచుకొంటూ వెళుతున్న ఆమెను పుంగనూరు పట్టణం నాలబాలవీధికి చెందిన సాదిక్ (15), అర్బాజ్(14) ద్విచక్రవాహనంపై వచ్చి ఢీకొట్టడంతో తలకు, కాలుకు గాయాలయ్యాయి, స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో మహిళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కురబలకోట మండలం తెట్టుకు చెందిన కిట్టన్న భార్య నాగసుబ్బమ్మ(54)ఆదివారం కుటుంబసమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించి ఆపస్మారక స్థితిలో పడిపోయింది. గుర్తించిన ఆమె బంధువులు చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తపాలా ఖాతా కోసం జనం పాట్లు

● ప్రభుత్వ సబ్సిడీలు పడాలంటే తపాలా ఖాతా తప్పనిసరంటూ మదనపల్లెలో పుకార్లు ● పనులు మానుకొని ఎగబడుతున్న జనాలు

మదనపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో ఖాతా ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సబ్సిడీ నగదు పడుతుందని మదనపల్లెలో పలు సామాజిక మాధ్యమాలలో పుకార్లు వ్యాపించడంతో జనం క్యూ కడుతున్నారు. ముఖ్యంగా మహిళలు పనులన్నీ మానుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇబ్బందులు పడుతూ పోస్టాఫీసులో పడిగాపులు కాచారు. పోస్టాఫీసులో ఖాతా లేకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సబ్సిడీ నగదు పడదని, వెంటనే పోస్టాఫీసులో ఖాతా తెరుచుకోవాలని పుకార్లు షికార్లు కావడంతో జనం పోస్టాఫీసుల వద్ద ఖాతాలు తెరవడానికి పోటీపడుతున్నారు. కాగా దీనిపై స్పందించిన పోస్టు మాస్టర్ సునంద దీపం 2.0 పథకం సబ్సిడీ డబ్బులు పోస్టాఫీసులో ఖాతా ఉంటేనే పడుతుందని తాము ఎవ్వరికీ చెప్పలేదన్నారు. పోస్టాఫీసులో అకౌంట్లు తప్పనిసరి అంటూ వచ్చిన సమాచారం పూర్తిగా అవాస్తవమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సబ్సిడీ డబ్బులు ఇకపై నేరుగా బ్యాంకు ఖాతాలో జమవుతుందని, అయితే.. ఇది వరకు ఉన్న బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ లింక్ లేకుంటే మాత్రమే పోస్టాఫీసులో ఐపీపీబీ ఖాతాను చేసుకోవాలని వివరణ ఇచ్చారు.

పోస్టాఫీసులో అకౌంటు తప్పనిసరి కాదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వచ్చే సబ్సిడీ నగదు పడటానికి ఇంతకు ముందు ఏ బ్యాంకు ఖాతా ఉన్నా దానికి ఎన్‌పీసీఐ లింకు చేసుకుంటే సరిపోతుందని అధికారులు చెప్పడంతో జనం అక్కడి నుంచి వెనుతిరిగారు. పోస్టాఫీసులో ఖాతా ఉంటేనే డబ్బులు పడుతాయనేది అవాస్తవమన్నారు.



తపాలా ఖాతాల కోసం కార్యాలయం వద్ద గుంపులుగా చేరిన మహిళలు

అయితే, ఏ బ్యాంకులో ఖాతా లేని వారు పోస్టాఫీసులో ఐపీపీబీ ఖాతా తెరుచుకుంటే ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ లింకు జరుగుతుందని వివరించారు. దీంతో ఈ విషయం తెలియక తామంతా ఉదయం నుంచి పనులన్నీ మానుకుని పడిగాపులు కాస్తున్నామని జనం తెలిపారు. కాగా ఈవిషయం తెలుసుకున్న వైసీపీ మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్ మదనపల్లె పోస్టాఫీసుకు వచ్చి అధికారులతో మాట్లాడారు. ఖాతాల విషయం ప్రజలకు ఎవరు చెప్పారని ప్రశ్నించగా తాము ఎవ్వరికీ చెప్పలేదని సమాధానమిచ్చారు. దీంతో ఆయన పోస్టాఫీసుకు వచ్చిన జనంతో మాట్లాడి ఎవ్వరూ పుకార్లు నమ్మవద్దని చెప్పడంతో వెనుతిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు.

బలిజ కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బలిజ సంఘం నేతలు

పీలేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్య, వ్యాపార, రాజకీయ, వైద్య, సేవా రంగాల్లో బలిజ కులస్థులు సంఘటితంగా రాణించాలని పీలేరు పట్టణ బలిజ సేవా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సదుం రోడ్డులో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఐకమత్యం లేకపోవడం వల్ల బలిజలు అన్ని రంగాల్లో అనేక అవకాశాలు కోల్పోతున్నారని వాపోయారు. అనంతరం కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఆర్‌ఐవో గన్నా ప్రభాకర్, మాజీ ఎంపీపీ కోలా మణి, జనసేన పీలేరు ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్, డాక్టర్‌మల్లిఖార్జున, రిటైర్డు ట్రెజరీ అధికారి పీవీ రమణ, డిష్ పురుషోత్తం, బలిజ సంఘం నిర్వాహకులు పోతంశెట్టి రమేశ్, వి.రామచంద్ర, పసుపులేటి లక్ష్మీకర, బంగారు నాగేంద్ర ప్రసాద్, జ్ఞానంగారి హరీశ్, బోయల్ల మధు, బాలిశెట్టి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక వనమహోత్సవం

పీలేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పీలేరులోని గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పీలేరు మండలం శివరామాపురం సమీపంలో వెలసిన భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో కార్తీక వనమహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం స్వామి, అమ్మ వారికి రుద్రాభిషేకం, అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా, శాస్త్రోక్తంగా జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని మహిళలు ప్రత్యేక పూజలు కార్తీక దీపారాధన చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్రశర్మ, సభ్యులు తెనాలి రామసుబ్రహ్మణ్యం, విరూపాక్షం కాశీ విశ్వనాథ్, పోస్టల్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో:మదనపల్లెలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మదనపల్లె బ్రాహ్మణులు ఆదివారం శంకర బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం శంకర బ్రాహ్మణ సేవ సమితి మదనపల్లె అధ్యక్షుడు కోదండరామయ్య ఆధ్వర్యంలో అభయ ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం జ్ఞానోదయ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో తిరుపతిరావు, సుబ్రమహ్మణ్యం, గట్టుప్రకష్, రఘునందన్, రామకృష్ణ, జ్ఞానోదయ స్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు, పాల్గొన్నారు.

రసవత్తరంగా స్కూల్స్ గేమ్స్ నెట్‌బాల్ పోటీలు

మదనపల్లె అర్బన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రెండో రోజు స్కూల్‌గేమ్స్ నెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇందులో వైఎస్ఆర్ కడప జట్టు చిత్తూరుపై 11-3 తేడాతో గెలిచి సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. అలాగే రెండవ క్వార్టర్ ఫైనల్‌లో కృష్ణా జట్టు గుంటూరు జట్టుపై 13-2 తేడాతో విజయం సాధించింది. మూడవ క్వార్టర్ ఫైనల్‌లో పశ్చిమ గోదావరి జట్టు అనంతపురం జట్టుపై11-4 తేడాతో విజయం సాధించింది. ఈ పోటీలు రాష్ట్ర స్కూల్‌గేమ్స్ నెట్‌బాల్ అబ్జర్వర్ రామాంజనేయులు, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి వసంత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్గనైజర్ కార్యదర్శులు నాగరాజు, నరేష్‌బాబు, పీఈటీలు, జిల్లా కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

పేదప్రజల వైద్యచికిత్సలకు సీఎం ఔదార్యం



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదప్రజల వైద్య చికిత్సలకు సీఎం చంద్రబాబునాయుడు ఔదార్యంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె మండలం, పట్టణంలోని 11 మందికి ఎమ్మెల్యే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న కొందరు ఆర్థిక సహాయం కోసం తన వద్దకు రాగా వారి వివరాలను సీఎంఆర్ఎఫ్‌కు పంపామన్నారు. అక్కడి నుంచి 11 మందికి రూ.లక్ష చొప్పున రూ.11 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు వచ్చాయన్నారు. వాటిని ఆయా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా ఎమ్మెల్యే వెళ్లి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కత్తి లక్ష్మన్న, సొక్కం వేణు, కౌన్సిలర్ నాగార్జునబాబు, మున్నానాయక్, షంషీర్, జేసీబీ వేణు పాల్గొన్నారు.

వైభవంగా దశ శాంతి హోమాలు

వాల్మీకిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరలో వెలసిన సమూహాలయంలో దశశాంతి హోమాలు, ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షిక మహోత్సవాలను షిరిడీసాయి సాలిగ్రామ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, అభిషేకం, అర్చన విశేష పూజలు జరిగాయి. అనంతరం సాయంత్రం గజవాహనంపై సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవం కన్నుల పండువగా సాగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్న, ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమాలలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలలో నేడు యాళి వాహనం

ధర్మపథం వార్షిక మహోత్సవాలలో భాగంగా యాళి వాహనంపై సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. అంతకు ముందు సోమవారం ఉదయం ఆలయంలో అభిషేకాలు, హోమాలు, పూజలు జరుగనున్నాయి.

తంబళ్లపల్లె దళితవాడలో వోల్టేజీ సమస్యకు చెక్

తంబళ్లపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె మండల కేంద్రంలోని తూర్పు దళితవాడలో కొన్ని నెలలుగా వేధిస్తున్న లో వోల్టేజి సమస్య ఆదివారంతో పరిష్కారమైంది. తంబళ్లపల్లె తూర్పు దళితవాడలో ఏర్పడిన లో వోల్టేజీ సమస్య కారణంగా పవర్ లూమ్స్ సరిగ్గా పనిచేసేవి కావు. దీంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అవసరమని ఏఈ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. వెంటనే స్పందించిన డీఈ గంగాధరం, ఏడీ గోవిందరెడ్డిలు స్థానికంగా పర్యటించి గతంలో ఉన్న సింగల్ ఫేస్ లైన్‌ను. త్రీ ఫేస్‌గా కన్వర్షన్ చేసి ఆదివారం నూతన 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. దీంతో లోవోల్టేజీ తీరడంతో ఆ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుకనూతనపల్లెలో రోడ్డు సమస్య పరిష్కారం

మదనపల్లె అర్బన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండామరిపల్లె గ్రామం, ఇసుకనూతనపల్లెలో ఆదివారం సీసీరోడ్డు నిర్మాణంతో రోడ్డు సమస్య పరిష్కారమైంది. గత 40 ఏళ్లుగా ఈ ఊరుల్లో రోడ్డు లేక పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. ఇంతకాలం ప్రజా ప్రతినిధులు మారినా, ప్రభుత్వాలు మారినా ఇసుకనూతనపల్లె లోని సమస్యలు తీరలేదు. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన నెలల వ్యవధిలోనే స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా దృష్టికి గ్రామంలోని రోడ్ల పరిస్థితి స్థానిక సీనియర్ నాయకుడు జయరాం యాదవ్, టీడీపీ రూరల్ అధ్యక్షుడు రమణ యాదవ్‌లు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సీసీరోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. దీంతో ఇసుకనూతనపల్లెలో లక్షల ఖర్చుతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ఏళ్లనాటి సమస్య తీరింది. గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

హార్సిలీహిల్స్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

బి.కొత్తకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక ప్రదేశంగా గుర్తింపు పొందిన హార్సిలీహిల్స్‌లో పర్యాటకరంగం అభివృద్ధికి ఏపీటూరిజం ద్వారా ప్రత్యేక దృష్టి పెడతామని తిరుపతి డీవీయం సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన ఆదివారం హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. హిల్స్‌పై పర్యాటకులను ఆకర్షించే ప్రదేశాలు, అక్కడి సమస్యలు, ఏపీటూరిజం ద్వారా పర్యాటకులకు అందుబాటులో ఉన్న సేవలు, సంస్థకు ఆదాయం, సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన ,సాధ్యమైన మేరకు హిల్స్ పై అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిబ్బందితో కలిసి ప్రయత్నిస్తామన్నారు. ఏపీ టూరిజం సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికే పదవులు



మంత్రి నారా లోకేశతో మైనార్టీ నేత మస్తాన్

మదనపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీలో ఆది నుంచీ కష్టపడి పని చేసిన వారికే గుర్తింపుతో పాటు పదవులు వస్తాయని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. స్థానిక టీడీపీ మైనార్టీ సీనియర్ నేత ఎస్‌ఏ మస్తాన్ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మొదటి నుంచి పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని మస్తాన్ కోరగా, మంత్రి పై విధంగా స్పందించారు. తాను అప్పట్లో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలలోల చేపట్టిన యువగళం పాదయాత్ర సక్సెస్ అయిందని, ఈ సందర్భంగా మంత్రి, మస్తాన్‌తో ప్రస్తావించారు. వైసీపీ అరాచకాలను ఎదుర్కొని పోరాడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, ముఖ్యంగా యువతకు పెద్దపీట వేస్తానని తెలిపారు.

'బాస్' బలోపేతానికి సంఘటితంగా కృషి చేయండి

పీలేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తమ సంస్థ బలోపేతానికి సంఘటితంగా కృషి చేయాలని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్ తన సహచరులకు పిలుపునిచ్చారు. జిల్లాలోని 'బాస్' ముఖ్య ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ బలోపేతంలో భాగంగా డిసెంబరు 1వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి పది వేలకు తగ్గకుండా సభ్యత్వం చేయించాలన్నారు. డిసెంబరు 20వ తేదీ నుంచి జనవరి 26వ తేదీ వరకు 12వ వార్షికోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు.

అలరించిన అఖిల భారత ఉర్దూ కవిసమ్మేళనం

మదనపల్లె, అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):స్థానిక బెంగళూరు బస్టాండ్ లోని బడే మాకాన్ హజరత్ ఖాదర్ షావొలియా దర్గా ఉరుసు మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం ఆహుతులను అలరించింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో ఉర్దూ భాష ప్రధాన భూమిక పోషించిందన్నారు. అనంతరం దేశ నలుమూలల నుంచి వచ్చిన ఉర్దూ కవులు తమ కవిత్వంతో అందరినీ విశేషంగా అలరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉర్దూ కవులు మహమ్మద్ షాహిద్, డాక్టర్ మహమ్మద్ నబీఉల్లా ఖాన్, డాక్టర్ ఇమాం ఖాసి సాఖి, కేసీ కరీముల్లా ఖాన్, జాఫరుద్దీన్‌లను దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, దర్గా ముతవల్లీ మకాన్‌దార్ సయ్యద్ హాషిం, ఉర్దూ కవి సమ్మేళనం కన్వీనర్ పఠాన్‌మహమ్మద్ ఖాన్, కార్యదర్శి భమర్ అమీన్, సౌదీ అరేబియాలోని మదీనా విశ్వవిద్యాలయం ఆచార్యులు ఇనాయత్ అమీన్, సర్వ శిక్షా అభియాన్ మాజీ సెక్టోరల్ ఆఫీసర్ చంద్రశేఖర్ నాయక్, రూటా నాయకులు ఇస్మాయిల్, సిబాత్ ఉర్ రహమాన్, నాదిర్ షావలి, షరాఫత్ అలీఖాన్, దేశ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున్న ఉర్దూ కవులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కోసం 38 దరఖాస్తులు

పీలేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణ-2025లో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో కొత్తగా ఓటరు నమోదు కోసం 38 దరఖాస్తులు అందినట్లు పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆదివారం ఆయన మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలు సందర్శించారు. తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో విధిగా ఉండాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: మండలంలో మొత్తం ఓటర్లు 26,141మంది ఉండగా వాటిలో ఉన్న తప్పొప్పులను సరిచేసేందుకు రెండు రోజుల పాటు ఓటర్ల జాబితాపై స్పెషల్ క్యాంపెయినింగ్ నిర్వహించినట్లు తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు. ఆదివారం ఆయన మండలంలో 22బూత్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ . మొత్తం 26 క్లైములు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మీకి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వాటర్‌షెడ్ జేఈ విశ్వనాథరెడ్డి మృతి

రామసముద్రం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లె గ్రామానికి చెందిన వాటర్‌షెడ్ జేఈ విశ్వనాథరెడ్డి(55) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి టీడీపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, పలువురు ప్రభుత్వ అధికారులు, మండల నాయకులు, నియోజకవర్గ ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన స్వగ్రామమైన చొక్కాండ్లపల్లెలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా విశ్వనాథ్‌రెడ్డికి ఇద్దరు కుమారులున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు దేశ రక్షణకు పాటుపడాలి



మిట్స్‌లో 76వ ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న యోగివేమన యూనివర్సిటీ వీసీ కృష్ణారెడ్డి తదితరులు

కురబలకోట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ విద్యార్థులు దేశ రక్షణకు పాటుపడాలని యోగివేమన యూనివర్సిటీ వీసీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో 76వ ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయ మన్నారు. అలాంటి వారి సేవలు ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. అలాగే ఎన్‌సీసీ క్యాడెట్స్ దేశ సమైగ్రతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, స్నేహభావం, సేవా దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కమాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.